# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 02-01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

1. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పల్లె పండగ రెండో విడతను ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.
2. ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు నుంచి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.
3. ప్రధాన ఆలయాలు ఉన్న ప్రాంతాలలో ఎకో టూరిజంను అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.
4. ప్రమాదాలను తగ్గించడంలో ఆర్టీసీ ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలవాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పల్లె పండగ రెండో విడతను ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా 6 వేల 700 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో 53 వేల 382 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీటిలో 8 వేల కిలోమీటర్ల మేర రోడ్లు, 25 వేల మినీ గోకులాలు, 58 కిలో మేర మీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నట్లు తెలిపారు. పల్లె పండగ రెండో విడత కోసం సాస్కీ పథకంలో కేంద్ర ప్రభుత్వం నుంచి 2 వేల కోట్ల రూపాయలు నిధులు సమకూరాయని, మిగిలిన మొత్తం నాబార్డుతోపాటు మరికొన్ని సంస్థల నుంచి సమీకరించనున్నట్లు వెల్లడించారు.

.......................

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమగోదావరి జిల్లా, భీమవరంలోని రేషన్ షాపుల్లో 20 రూపాయలకే కిలో గోధుమపిండి విక్రయాలను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లోని రేషన్ కార్డుదారులకు ఈ నెల నుంచి బియ్యం, పంచదారతోపాటు నాణ్యమైన గోధుమ పిండిని కూడా సబ్సిడీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నట్లు తెలిపారు.

...............................

ఆంధ్రప్రదేశ్ లో భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నేటి నుంచి ఈ నెల 9వ తేదీ వరకూ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ప్రభుత్వం పంపిణీ చేసే కొత్త పాస్ పుస్తకాల మీద క్యూఆర్ కోడ్, రాజముద్ర  ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల 80 వేల పాస్ పుస్తకాల పంపిణీకి అన్ని ఏర్పాట్లు
చేశామన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 17 సెకన్లు

..........................

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను నిన్న మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్‌కు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారిరువురు కాసేపు చర్చించారని అధికారులు తెలిపారు.

........................................

ప్రధాన ఆలయాలు ఉన్న ప్రాంతాలలో ఎకో టూరిజంను అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. నెల్లూరులో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 590 కోట్ల రూపాయలతో 492 పురాతన ఆలయాల  పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎన్.డి.ఏ. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దేవాదాయ శాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. ఆగమశాస్త్ర నియమాల మేరకు ఆలయాల్లో పూజలు జరుగుతున్నాయని తెలిపారు. వేద విద్యను ప్రోత్సహిస్తున్నామని మంత్రి ఆనం వెల్లడించారు.

...........................

ప్రమాదాలను తగ్గించడంలో ఆర్టీసీ ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలవాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్ లోని ఆర్టీసీ కళాభవన్ లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యున్నత భద్రత ప్రమాణాలతో విధులు నిర్వర్తించిన డ్రైవర్లకు మంత్రి పురస్కారాలను  అందజేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ..

..వాయిస్.. 35 సెకన్లు

.............................

దేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలుస్తుంది. 'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన ఈ ఏడాది కాలంలో మౌలిక సదుపాయాల రంగంలో దేశం సాధించిన పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న ప్రత్యేక కథనం..

దేశంలో రహదారి, రైలు, విమాన, నౌకా యాన మార్గాల వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజల ఆకాంక్షలు గత ఏడాది వాస్తవ రూపం దాల్చాయి. అత్యంత మారుమూల ప్రాంతల నుంచి దేశంలోని పట్టణ కేంద్రాల వరకూ అనుసంధానం మెరుగుపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం ఖర్చు చేసిన మూలధన వ్యయం 11.21 లక్షల కోట్ల రూపాయలకు పెరగింది. జిడిపిలో ఇది 3.1 శాతానికి సమానం. మిజోరాంను తొలిసారి దేశ రైల్వే నెట్‌వర్క్ కు అనుసంధానించడం జరిగింది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టులో భాగంగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన గా పేరొందిన చీనాబ్ వంతెనను, తమిళనాడు – రామేశ్వరంలను కలుపుతూ నిర్మించిన పంబన్ వర్టికల్ బ్రిడ్జి జమ్ము, కాశ్మీర్ లోని జడ్ మోర్ట్ సొరంగాన్ని ప్రధాన మంత్రి గత ఏడాది ప్రారంభించారు. ఇలా దేశంలో అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ప్రభుత్వం కొన్నింటిని ప్రారంభించడం, మరికొన్నింటిని పూర్తి చేసి జాతికి అంకితం చేయడం జరిగింది.

.........................

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశగాను, దక్షిణ  కోస్తా, రాయలసీమల్లో ఈశాన్య, తూర్పు దిశగాను గాలులు వీస్తున్నాయని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా,  యానాం, దక్షిణ  కోస్తా, రాయలసీమ ల్లో  ఈ రోజు దట్టంగా పొగమంచు  కురిసే అవకాశము వుందని వాతావరణ కేంద్ర అధికారిని జి. లక్ష్మి పేర్కొంటూ..

వాయిస్...22 సెకన్లు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఎజేన్సీ, ఇతర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు  5 డిగ్రీల నుంచి 15 డిగ్రీల సెల్సియస్ లోపు నమోదవుతున్నాయి. తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

..................

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులకు సూచించారు. హైదరబాద్ లోని సచివాలయంలో అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా, పరిశ్రమల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా  కొత్త కోర్సులను

అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించేందుకు ఫ్యాక్టరీలు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

.........................

ఆంధ్రప్రదేశ్ లో పారా మెడికల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు తొలిసారి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. రెండేళ్ల వ్యవధి కలిగిన పారా మెడికల్ కోర్సు ప్రవేశాలు పొందిన వారు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకపోతే వార్షిక సమయంలో జరిపే సప్లిమెంటరీ పరీక్షలను రాసేవారని, ఈ విధానంలో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఒక ప్రకటనలో పేర్కొంది విద్యార్థులు నష్టపోకుండా ఉండేలా ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరపాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఫెయిలైన విద్యార్థుల నుంచి ఈ నెల 5 నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశామని వెల్లడించింది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ ఇందుకు సంబంధించి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

......................

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో శాశ్వత పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ ప్లాంటును ఏర్పాటు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. అమరావతిలోని సంస్థ

కార్యాలయంలో ఆయనను  శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులు పలువురు నిన్న కలిశారు. ఈ సందర్భంగా కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. శ్రీశైలంలో స్వచ్ఛతను కాపాడుతామని, ప్లాస్టిక్ రహిత శ్రీశైలంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. శ్రీశైలానికి ప్రతిరోజు వేలాదిగా తరలి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని  పారిశుధ్య పరిరక్షణకు అన్ని చర్యలూ చేపడతామన్నారు.